వ్యత్యయము

౧

నరసింహులుకు కాటఁడు పాలేరు. ఇపు డిరువురికిని సుమారు ఎనుబదేండ్లు.

కాటఁడు నమ్మినబంటు. నరసింహులయింట దొంగలు పడినపుడు కాటఁడు తానే వారిదెబ్బలు తినెను. పని పట్టినపుడు ముసుకురేలఁ గాఱడవులగుండ పయనించి దొరపనులన్నియు సాధించెను. ఊరంతయు కాలిపోవుచున్నపుడు తన శరీరమంతయు కాలినను దొరయిల్లు కాపాడెను.

నరసింహులుకూడ కాటని కఱవులలో కాపాడెను. పెండ్లిపేరంటము లొనరించెను. ఇల్లు కట్టించియిచ్చెను. కూడు గుడ్డలకు వెతుకుకొన నక్కఱలేకుండఁజేసెను. ఇటులు దొర వలన పాలేరును పాలేరువలన దొరయు సుఖజీవన మొనరించిరి.

ప్రాయము పడమటికి తిరిగినపిమ్మట దొరకును, పాలేరునకును పుత్రోదయమాయెను. దొరకొడుకు సోములు, పాలేరు కొడుకు రాములు. కొడుకులఁగని యాయమ్మ లిరువురును ఒకరి తరువాత నొకరు పసపుకుంకుమలతో పరలోక మేఁగిరి.

ఒకనాఁడు కాటఁడు నలుగురిసాయముతో నరసింహుల యింటికి నడచివెళ్లెను. మడిగట్టుకొని యున్న సోములు కాటని

జూచి 'దూరముగా నుండుము'ని కరాళించి లోనికి తొలఁగి పోయెను.

గదిలో జ్వరశయ్యమీఁద నున్న నరసింహులు— 'ఏమిరా నాయనా? ఏల యటులు బొబ్బవెట్టెదవు?' అని యడిగెను.

'ఉఁహుఁ. వింటివా? పాముచెవులు! ప్రొద్దున నే కాటఁడు, మధ్యాహ్నమున కాటఁడు, సాయంకాలము కాటఁడు. కాటఁడు కాటఁడు!' అని సోము లనెను.

నరసింహులు కర్ర పొడుచుకొనుచు వాకిటికివచ్చి అరఁగుపై కూరుచుండెను. మాలఁడు భక్తిపూర్వకముగా తల నేల మోపెను. బాపఁడు దీవించెను. వా రొకరినొకరు తమతమ ఆరోగ్యముగుఱించి ప్రశ్నించుకొనినపిదప కాటఁడు— 'స్వామీ! నా కిఁక స్వామిసేవ చేయఁగల భాగ్యములేదు. ఇదియే చివరచూపు...' అని చెప్పుచుండఁగా అతని కంఠము స్తంభించెను. పలుకు గద్గదమాయెను. కనుల నీరోడెను. కాటఁడు కాష్ఠమువలె క్రిందఁబడెను; నరసింహులు లేచి రెండడుగులు ముందరికి వేయుచుండఁగా నలుగురు కలిసి కాటని లేవఁదీసి కూరుచుండఁబెట్టిరి. కాటఁడు కొంచెము సేపటిలో కన్ను దెఱచి చూచెను.

నరసింహులు కన్నీరు బొటబొట జాఱుచుండఁగా— 'కాటా! మన మిరుపురమును ఒకపడవనే యెక్కితిమి. నీవు

ముందు నేను వెనుక. నీ వీక దుఃఖింపకుము! నారాయణుని స్మరింపుము' అని యనెను.

అదియే యుపదేశముగా కాటఁడు నారాయణమంత్ర మును గ్రహించెను. అటుపిమ్మట నతఁడు తనకొడుకునుదక్కఁ దక్కఁగల బంధుగుల నవలికిఁ బంపి నరసింహులయెదుట నొక మూట విప్పెను—నూ అరకాసులు. కాటఁడు వానిఁ జూపి— 'అయ్యా! ఇది మీసొత్తే. ఇవి తమకడనే సంపాదించితిని. నా కొడుకున కిఁక మీరే దిక్కు. అక్కఱలో వీని నతని కిత్తురు గాక'అని మనవిచేసెను. నరసింహులు సోములను బిలిచి కాసుల సంగతి చెప్పి భద్రపఱపించెను. కాటఁడు మ్రొక్కులు మ్రొక్కి నారాయణుని స్మరించుచు పలువురసాయమున తనయింటి కేఁగెను.

౨

నరసింహులచటనే కూరుచుండి పలుమాఱు లావులించెను. అతని కదియే తుదిసెలవుగా కానిపించెనా? అతఁడు నిట్టూర్చి ఆకాశముకేసి చూచుచుండెను. అతని కేమియు తోఁప లేదా? ధనముకన్న విలువయగువస్తు వేమని పోవుచున్నడా? ఔను. తానును కాటఁడును ఒకరివెనుక నొకరు దున్నిరి. పాండ్రపొలములను పంటపొలములనుగా మార్చిరి. రాత్రు లందు చేలగట్లమీఁద నెదురుబొదురుగా శయనించిరి. నీరు కట్టిరి, కోసిరి, కుప్పలువేసిరి, నుఱిచిరి. వారి కిండ్లకడనే దవ్వు. పనిలో ప్రేమలలో ఒకటే చేయి, ఒకటే మనసు.

కాటని బాహుబలమును దానికన్న మిన్నయగు విశ్వాసమును తన సౌభాగ్యమునకు కారణము. ఆభాగ్యముచేతనే తాను బవంతి కట్టుకొనెను, కాటనికి ఇల్లు కట్టించియిచ్చెను. తాను పెండ్లిచేసికొనెను, కాటని నొక యింటివానిఁ జేసెను. అట్టి కాటఁడు తనకడనేకాక యిహలోకముకడ సెలవుగొనిపోవుచుండఁగా ధనముకంటె విలువఁగల పదార్థ మొకటి తనను మఱపించిపోవుట లేదా ?

నరసింహు లటులు కూరుచుండి కూరుచుండి రేయిదొరుదలయందు కాటనిఁ గానఁబోయెను, ఆముదపుదివ్వె వెలుఁగుచుండఁగా నరసింహులు కాటని కాయమును కనుఁగొనెను. అతనికి దుఃఖమును సంతోషమును ఒకతూరియే కలిగెను. రాముఁడు 'దొరగారు వచ్చిరి,దొరగారువచ్చిర'ని తండ్రిచెవిలో నూఁదెను.

ఇపుడు చెవిలో నూఁదవలయునది 'నారాయణ' అని నరసింహు లనెను.

కాటఁడు 'నారాయణ' అని అనెను. అతఁడు కనులెత్తి కనలేకపోయినను నరసింహులదెస చేతు లెత్తెను. అంతట నరసింహులు జ్వరబాధచే గడగడవడఁకుచు వెనుదిరిగిపోయెను. నరసింహులు లిల్లుచేరి తన ఆస్తిలో మూఁడవపాలు కాటని కొడుకు రాములకు వ్రాసి రాముని పిలిపించి యాకాకిత మతనికిచ్చెను. రాములు దానిని సోములకడ దాఁచనిచ్చెను.

నరసింహు లంతట నపథ్యమయినను స్నానముచేసి శయ్య నాశ్రయించెను. స్పృహకలిగినపుడు ఇచట నరసింహుల కును అచట కాటనికిని నారాయణస్మరణముతక్క వేఱుమాట లేదు.

ఎవరము ముందర పోదుమా యని పన్నిదము చఱచిన చందముగా వా రిరువురు నొక్కొక్కయింద్రియమును విడనా డుచు మృత్యువుముంగలికి పరుగిడిరి. శ్మశానమున స్వామిభృత్యు లిరువురు నొకరివెలుఁగును మఱియొకరు చూచుకొనుచు కలసియే పరలోక మరిగిరి.

3

సోములు కడుఁగొలఁదికాలములోనే సొంతసేద్యపు కామాటము ఎత్తివేసెను. తన పొలములనేకాక తన తండ్రి రాముల కిచ్చివైచిన పొలమునుగూడ నమరకపఱిచెను.

సోముల కిపుడు కావలసినంత తీరిక. ఆఁతడే యిపుడు కులమునకును గ్రామమునకును పెద్ద. సంఘవ్యవహారములకు గ్రామవ్యవహారములకును అతఁడే యిపుడు పరిష్కర్త.

ఒకనాఁడు సోములు గీతలు చదివి ఇటులు అర్థము చెప్పి కొనుచుఁబోవుచుండెను—'ఎఱుకగలవారు విద్యావినయములు కల బ్రాహ్మణునియెడలను ఆవునెడలను ఏనుఁగునెడలను కుక్క యెడలను మాలనియెడలను సమబుద్ధికలవారు.'

రాము లపుడు సోముల యెట్టెదుటికివచ్చి చేతులు జోడించి దూరముగా నిలువఁబడెను. రాములను చూచినంతనే సోములఅవస్థ మాఱెను. అతఁడు గజిబిజిపడి గీతలుమూసి నేల చూచుచుఁ గూరుచుండెను.

రాము లిటు లనెను—'అయ్యా! తమ తండ్రిగారును వారి బంటును ఒకరి నొకరు వదలలేక వదలలేక తుదకు కలిసియే పయనించిరి. వారియిరువురి స్థానములందును ఇపుడు మన మున్నాము. మానాయన విశ్వాసమే నాకు తమయెడఁ గలదు. తమ నాయనగారి అనుగ్రహమునే తమరు నాయెడ నవలంబింపుఁడు. నేను మీావ్యవసాయమంతయు చేసెదను. మీారు లోటుపాటులు సవరించుకొనుచుండుఁడు.'

సోము లిటు లనెను—'నేను వ్యవసాయ మెత్తివైచితిని. అందులకు నీ వీక ఒడలు విఱుచుకొననక్కఱలేదు'

'నా కిదియంతయు అయోమయముగా నున్నది. ఇంతతొందరగా తమ రింత తాఱుమాఱేలచేసితిరి?'

'దీనిలో అయోమయముగా నుండుట కేమున్నది? మానాయనగారికి వ్యవసాయమేవృత్తి. నాకీక అదికాదు. అందుల కని అంతయు అమరకపఱచితిని.'

'అటులగుచో నాపత్రమును నాకాసులను నాకిండు.

'నీకు పొలమును లేదు. కాసు లంతకన్న లేవు. నా పొలమంతయు పాలున కిచ్చుకొంటిని. అదంతయు మాసొత్తు!'

'తమ నాయనగారు వ్రాసినపత్రమును చెల్లునటులు చేయరా?'

'నా అనుమతిలేకుండ పత్రము వ్రాయుటకు నాతండ్రి కేమి హక్కు? దొంగలును దొంగలునుకలిసి ఊళ్లుపంచుకొనిరనినటు లున్నది. నీనా తండ్రులు కలిసి పయనించిరనికదా యనఁ గలిగితివి! ఏమి? చాలు నీ మరియాద. ముక్కుపచ్చలు మానకమునుపే బిరుదుపిచ్చుక కాట్లాడవచ్చినదఁట! చేతనగుచో వ్యవహారము చేసికో!' అని చివాలున లేచి పత్రము తెచ్చి ముక్కలుముక్కలుచేసి ముంగిటఁ బాఱవయిచి లోని కేఁగి తలుపులు మూసికొనెను.

రాము లాకాకితపు ముక్కలకేసి చూచుచు చాలసేపు అచటనే నిలువఁబడెను. రాములకు కాళ్లక్రింద భూమి లేనటులాయెను. 'ఔరా వ్యత్యయము' అని అనుకొనుచు నిలువఁబడి నిలువఁబడి అతఁ డాముక్కల నన్నిఁటిని ప్రోగుచేసి మూటకట్టుకొనెను. తన అదృష్ట మిపుడు తనమూటలోనే కలదని రాములకుఁ దెలియును. అదృష్టమో దురదృష్టమో తానే యిపుడు నిర్ధారణ మొనరించుకొనవలయును. ఇపుడు ధర్మమునకు ప్రతినిధియగు నరసింహులును లేఁడు, కాటఁడును లేఁడు. ఇపుడు వారియిరువురయు స్మృతిమాత్ర మున్నది. ఇటులు వారిని స్మరించుచు రాములు కొంచెమువవ్వగా పోయి కూర్చుండెను.

సోము లన్నము తినుచుఁ దినుచు చివాలున లేచి తలుపుతీసికొని ముంగిటికి వచ్చి పరికించి చూచెను. అచట నొక కాకిత మేని కనఁబడకపోయెను. గాలికి అటు ఇటు కొట్టుకొనిపోయెనేమో యని నలుమూలలు తిరిగి చూచెను. కానిపింపలేదు. అతనికి పిచ్చులును వెర్రులును పుట్టుకొని వచ్చెను.

ఈ ప్రమాదమును గుర్తించి సోములభార్య దీపముఁ గొని వాకిటిలోనికి రివ్వునవచ్చి తానును నేలయంతయు కలయఁజూచి—'మీరు పత్రము చింపితి రని నేరమురాదు కదా కొంప తవ్వి' అని యనెను.

సోముల కావెలుఁగున నంధకారమే యెక్కువాయెను. అతఁ డాకాశముచూచి పిడికిలించి—'రాముఁడే ఎత్తుకొని పోయియుండును. ఇది వానిపనియే. కానీ కోర్టున్నది. వాఁడున్నాఁడు. ఈయాస్తి వెలయెంత యుండునో అంతయు కక్కింపక దీనిని వానికిఁ దక్కనీయను కాని యిది నేరము కాదు కద?' అని యనెను.

రాము లిటు లనెను—'అయ్యా! జడియకుఁడు! మీరు చింపివైచిన కాకితపుముక్క లన్నియు నివిగో! తాము వీనిని జాగ్రత్తపెట్టుకొనుఁడు.'

౪

పదుగురికి అన్నముపెట్టు కొటనియిల్లు నేఁడు పొల్లు. రాముఁడు లోఁగడ అన్నాభావ మెఱుఁగడు. రెన్నాళ్లనుండి పస్తు.

అతనితోఁ గలిసి బడిలో చదివికొనిన రెబెకాకు రామునియవస్థ తెలియును. తలిదండ్రులకు తెలియకుండ ఆమె అన్నముతెచ్చి నిదిరించుచున్న రామునిముందు పెట్టి యతనిని ఆచి చూచి వెనుదిరిగెను. తమ గుడిసెకును రాము నింటికిని నడుమ యొక చిన్నకంచె. దాని నామె దాఁటుచుం డఁగా నాదారిని పోవుచున్న పాదిరీ చూచెను.

కొంతవడికి రాముఁడు మేలుకనెను. ఎట్టెదుట అన్నము చూచెను. అతని కాశ్చర్యము కలిగెను. 'ఈ కటివులో నాయాఁకలి యెఱిఁగినవా రెవరు? ఓ భగవానుఁడా! నాయెడ నీ కెంతదయ! నాయాఁకలియు నీకుఁ దెలిసెనా?' అని యనుకొనెను.

అతనికన్నులనుండి జొటజొట నీరు రాలెను. వాకిటికి వచ్చి చూచెను. కాకియేని కనఁబడలేదు. అంత నతఁడు భగవంతుని స్మరించుచు అన్నము ముందు కూరుచుండి భుజిం చుచుండఁగా కంచె యావలినుండి రెబెకా రెండుకన్నులును రామునిపైఁబడెను. రాముఁడు లజ్జచే తలవాల్చి కొంత

నేపటికి తలయెత్తఁగలిగి రెబెకాను చూచెను. ఆచూపులో అన్నదానముకన్న ఆత్మదానమే యెక్కుడుగాఁ గానిపించెను. రెబెకా తల వంచి చాటుల కేఁగుచుండఁగా రాముఁ డామెకు ధన్యవాదము చెప్పెను.

రాముఁడు మరల నన్నదానము చేయఁగల యవకాశ మును రెబెకాకు కల్పింపలేదు. కాని తనను చూచుట కవకాశ మీయకపోలేదు. రెబెకారాముల రహఃప్రసంగములను రెబెకా తలిదండ్రులు నిరోధింపలేదు.

రెబెకా రాముని కిరస్తానీమతమున కలియు మనెను. రాముఁడు కిరస్తానిమత మన నేమి యని యడిగెను. రెబెకా చెప్పఁజాలకపోయెను. రాముఁడు లోతుగా చూచెను.

ఒకనాఁడు పాదిరీ రెబెకా తండ్రిని పిలిచి—'నీకూఁతురు రాముని ప్రేమించుచున్నటులు నాకు తెలియును. దానికి నా దీవనలు. కాని రాముని మతములో ఎంతవడిగా కలుపఁగలిగిన నంతవడిగా పెండ్లిచేసికొనవచ్చును. మతమునఁ గలిసిననాఁడే రాముఁడు పంతులు, రెబెకా పంతులమ్మ యౌను' అని పంపెను.

రెబెకాతండ్రి రాముని జూడఁబోయి—'నీవు వెంటనే మతము పుచ్చుకొనవలెను' అని యనెను 'ఏల?' యని రాముఁ డడిగెను. 'పుచ్చుకొననిచో రెబెకానీయ వీలులే'దని రెబెకా తండ్రి చెప్పెను. 'నేనిపుడు నిజుపేదను; మతము పుచ్చికొని

నంతమాత్రమున పిల్ల నిత్తువా?' అని రాముఁ డనెను. 'మతము గొనుచో నీవు పంతుల వగుదువు. పోయి దొరగారిని చూడు మ'ని రెబెకా తండ్రి చెప్పెను.

రాముఁడు పాదిరికడకు బోయెను. అతఁడు తెలుఁగు బైబిలు తెఱచి—కంటికికన్ను, పంటికిపల్లు అని చెప్పబడినమాట మీరు విన్నారు. అయితే నేను మీతో చెప్పేది ఏమనగా, దుష్టుని ఎదిరించక నిన్ను కుడిచెంపమీద కొట్టువానితట్టు రెండవదికూడ తిప్పుము. నీతో వ్యాజ్యమాడుచు నీ అంగీ తీసుకొన కోరువానిని నీపైవస్త్రముకూడ తీసుకొన నిమ్ము. ఒకడు ఒకమైలుదూరము రమ్మని నిన్ను బలవంతముచేసితే వానితో రెండుమైళ్లు వెళ్ళుము. నిన్ను అడుగుకొనువాని కిమ్ము. నీయొద్ద అప్పుపుచ్చుకొనకోరే వానినుంచి నీముఖము తిప్పుకొనవద్దు, అని చదువుచుండెను.

'పక్షులను చూడుఁడు! అవి విత్తవు, కోయవు, కొట్లలో నిలువచేయవు. అయినను ఆకాశమందున్న మీతండ్రి వానిని పోషించుచున్నాఁడు. మీరు వానికంటె శ్రేష్ఠులు కారా? మీలో నెవఁ డెంత తలపోసినను ఆయువు మూరెఁ డెక్కువ చేసికొనఁగలరా? బట్టలకు వగవనేల? అడవిపూ లెటు లెదుగుచున్నవో యెఱుఁగరా? అవి శ్రమించి వడకవు. ఏచక్రవర్తియు సకలసంపదలతో వానివలె అలంకృతుఁడు కాఁజాలఁడు.

నేడుండి రేపు ప్రొయిలోఁ బడుదానిని భగవంతుఁ డిటు లలంకరింపఁగా ఓవిశ్వాసవిహీనులారా! మిమ్ముల వానికంటె నెక్కువగా అలంకరించునే! కాన ఏమి తిందు మేమి త్రాగుదు మేమి కట్టుదు మని వగవవలదు. ఇవి ఎవరో సమకూర్తురు. ఇవియన్నియు మీకు వలయునని ఆకాశమునం దున్న మీతండ్రికి తెలియును. కాని మీరు దేవునిరాజ్యమును మొదట వెదకుఁడు. అపు డివియకాక యెన్నియో మీకు సమకూరును, కావున రేపటిసంగతినిగూర్చి వగవకుఁడు' అని చదువుచుండెను.

రాము లది విని నాఁటికి వెడలిపోయెను. అతఁ డిటులు నెలరోజులు పాదిరికడకు వెళ్లెను. రాముఁడు జకరయ్యగా మాఱెను. కొలఁదినాళ్లలో నే రెబెకారాములకు పెండ్లియాయెను.

౫

రెబెకా జకరయ్య లిరువురును నెలరోజులు పాదిరి యింటిచుట్టును తిరిగిరి. నూఱునేఁబదిరూకలు నా కిచ్చుచో పాలికరూకల పంతులపని యిప్పింతునని పాదిరి యనెను.

జకరయ్యకు లజ్జయు ఉదాసీనతయుఁ గలిగెను. అతఁ డిటు లనెను—'అయ్యా అన్నముచే కడుపునిండు ననియు బైబిలుచే నోరు నిండు ననియు సద్వృత్తిచే మనస్సు నిండు ననియు నేను మతమునఁ గలిసితిని. నాకు పూఁటకూటికి టికాణా లేదు. నే నిన్నిరూక లెటు లీఁగలను?'

'కాటఁడు కాసులమూట యని యేరికి తెలియును?' అని పాదిరీ యనెను'.

'కాసులమూటమాట నిక్కమే. మానాయన అప్పుల వారి కిచ్చివేసెను' అని రాము లనెను.

పాదిరి నవ్వి—'ప్రకృతము పదియేనురూకల కొకటి యును పదిరూకల కొకటియును కాళీ యున్నవి, మీయిరువు రును ప్రవేశింతురా?'

రెబెకా జకరయ్యలు సంతసముతో నంగీకరించి వెళ్లి పోయిరి.

రెబెకా పంతులమ్మ యాయెను. జకరయ్య పంతులా యెను!

రెబెకా జకరయ్యలు ప్రతి ఆదివారమునాఁడును ఏసు పేర పావలా ముడుపు కట్టవలసియుండెను. వేలు వేలు పండుగ లలో పండుగుపండుగునకును ఒకొకరూపాయ యీవలసివ చ్చెను. నెల కొకరూపాయ యిచ్చి మతవాఙ్మయము కొన వలసియుండెను. ఇదియంతయు లెక్కవేసి చూడఁగా కుడిచేతితో ఇచ్చి ఎడమచేతితో లాగుకొనుచందముగా నుం డెను. వీనియన్నిటికిని చెల్లఁగా మిగిలిన ద్రవ్యము రెబెకా రాములపొట్టకు చాలలేదు. ప్రొద్దుగ్రుంకులు బడలో వాగివాగి యింటికడకు వచ్చినఁగోలె వారికి వాకట్టు.

పాదిరివలననే తమజీత మిటు లారతికప్పుర మగుచున్న

దని జకరయ్య తెలిసికొనెను. జకరయ్య పాదిరిదర్శనమున కేఁగి తమకు కలుగుచున్న యన్యాయమును సర్దుబాటు చేయఁ గోరెను.

'ఓరీ! మే మేసుకొలమువారము. మీకును ఏసునకును సాక్షాత్సంబంధము లేదు. మాగుండ మీ రాయేసుగుడి ముంగిలికి మాత్ర మేఁగఁగలరు. మీనల్లవారందఱు మానుబానిసలు. బానిసలమీఁద నుంపవలసిన దయ నాకు తెలియును. నేను చేయఁగలిగినంత ఉపకారమును చేసివేసితిని' అని యనెను.

జకరయ్య తలవాల్చి—'నీదవడమీఁద కొట్టినవానికి రెండవదవడగూడ ఒగ్గుము, నీ చొక్కా తీసికొనినవానికి నీకోటుగూడ నిషేధింపకు' మని చదివి యింటికి వెళ్లిపోయెను.

కొలఁది దినములకే రెబెకా జకరయ్యల యుద్యోగము లుద్వాసితము లాయెను. రెబెకా ఆనాఁడు 'కిరస్తాని మతము కానిమతము' అని జకరయ్యతో అనెను.

జకరయ్య చిఱునవ్వు నవ్వి యిటు లనెను—'విద్యావినయములు కల బ్రాహ్మణుఁడును మాలఁడును ఎఱుకగలవారి కొకటే' యని చదువుచు దాని యర్థమును తృణీకరించు సోములుగారే చెడ్డవా రని యనుకొంటిని. 'దైవమును చింతించుచుండువారిని దైవమే కాపాడు' నని చదువు పాదిరి సోములుగారికి తీసిపో యెనా? ఏమతములో తప్పున్నది, స్వార్థపరుఁ డగుమానవు

నిలోఁగాఁక? ఇంతకు నేఁటి మాలల యవస్థ యిటు లున్నది. భగవంతున కెవరిమీఁద ననుగ్రహము కలుగునో వారి కతఁడు ధనము లేకుండఁజేయును. భగవంతుఁ డిటు లనెను—

'ఎవ్వానిఁ గరుణింప నిచ్ఛించితిని వాని
యఖిలవిత్తంబు నే నపహరింతు'

మన మిఁక దాసరుల మగుదము పద.'